


ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రారంభం

ప్రజాశక్తి - జామి

జామి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ప్రభుత్వ జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేసిన నేపథ్యంలో ఈ ప్రాంత విద్యార్థులు ఇంటర్ చదువును సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాశాఖాధికారి గంగరాజు, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు రహమాన్ కోరారు. గతంలో మండలంలో జూనియర్ కళాశాల ఏర్పాటు కోసం జిజె కాలేజీ సాధనా సమితి పేరుతో మండలానికి చెందిన విద్యా వేత్తలు, జర్నలిస్టులు, ప్రముఖులు, ప్రజలు ఏకమై అనేక ప్రయత్నాలు చేశారన్నారు. వారి ఆకాంక్షల ఫలితంగా ప్రస్తుతం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యంపిసి, సిఇసి గ్రూపులతో జూనియర్ కళాశాల ప్రారంభమవుతోందన్నారు. ఈ కళాశాలలో అన్ని రకాల సౌకర్యాలనూ ప్రభుత్వం కల్పిసుందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ కళాశాల అభ్యున్నతికి మద్దతిచ్చి సహకరించాలని, ఈ ప్రాంత విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఖరీఫ్‌కు సన్నద్ధత ఏదీ?





- విత్తనాలు, ఎరువులపై భరోసా ఇవ్వని అధికారులు
- ప్రణాళికపై సమావేశాలూ కరువే

ఖరీఫ్ సీజన్ మరోవారంలో వచ్చేస్తుంది. మునుపెన్నడూ లేని విధంగా ఈనెలాఖరు నాటికే రుతుపవనాలు వచ్చే అవకాశాలు ఉన్నాయని వాతావరణ కేంద్రం చెబుతోంది. కొద్దిరోజులుగా జిల్లాలో అక్కడక్కడా వర్షాలు కూడా కురుస్తున్నాయి. ఎండతీవ్రత ఎక్కువగానే ఉన్నప్పటికీ అడపాదడపా కురిసిన వర్షాలు కాస్త ఉపశమనం కలిగిస్తున్నాయి. ముఖ్యంగా ఎండకు వేడెక్కిన భూములు కొద్దిరోజులుగా చల్లబడ్డాయి. అంతా అనుకూలిస్తే జూన్ మొదటివారం నుంచే దుక్కులు వేసుకునేందుకు అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇటువంటి సమయంలో ఖరీఫ్ పంటల ప్రణాళిక తెలియజేసి రైతులకు అండగా ఉంటామన్న సాంకేతాలివ్వాల్సిన వ్యవసాయ శాఖ అధికారులు అటువంటి ప్రయత్నాలేవీ చేయడం లేదు. దీంతో, రైతుల్లో అయోమయ పరిస్థితి నెలకుంది.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విజయనగరం జిల్లాలో సాధారణంగా జూన్‌లో రుతపవనాలు వస్తాయి. ఇందుకు ముందుగానే అధికారులు పంటల వారీ సాగు విస్తీర్ణం, విత్తనాలు, ఎరువులు, వాటిపై ప్రభుత్వం ప్రకటించిన సబ్సిడీ వంటి గణాంకాలు సిద్ధం చేస్తారు. ఇందుకనుగుణంగా ప్రభుత్వం నుంచి రప్పించేందుకు అధికారులు కసరత్తుచేసి రాష్ట్ర కేంద్రానికి నోట్‌ఫైల్ పంపుతారు. దీనికి ముందుగా జిల్లా కలెక్టర్ లేదా జాయింట్ కలెక్టర్ సమక్షంలో సమావేశాలు నిర్వహించి ప్రణాళిక సిద్ధం చేస్తారు. కానీ, ఈ ఏడాది ఖరీఫ్‌పై అటువంటి సన్నద్ధత ఏమీ కనిపించడం లేదు. వాస్తవానికి విజయనగరం పూర్తిగా వ్యవసాయ ఆధారిత జిల్లా. సాగునీటి వనరులు పెద్దగా లేకపోవడంతో ఖరీఫ్ సీజన్ మాత్రమే జీవనాధారం. వరి, మొక్కజొన్న, చెరకు, పత్తి, నువ్వులు, వేరుశెనగ తదితర వ్యవసాయ పంటలు సుమారు 4,94,455 ఎకరాల్లో సాగవుతాయి. మరో 1,49,162 ఎకరాల్లో రకరకాల కూరగాయాలు, టమాట, ఉల్లి, పువ్వులు, ఆయిల్ ఫామ్ వంటి ఫుడ్ అండ్ నాన్‌ఫుడ్ ఉద్యాన పంటలు సాగవుతాయి. రైతు కుటుంబాల మనుగడకు ఖరీఫ్ సీజన్ అత్యంత కీలకమైనది. 2022-23 ఖరీఫ్ సీజన్‌లో 2,90,476 ఎకరాల్లో వివిధ రకాల వ్యవసాయ పంటలు సాగయ్యాయి. ఈ ఏడాది (2023-24) 3,03,102 ఎకరాల్లో సాగు కావచ్చని అధికారులు అంచనాలు రూపొందించగా, సీజన్ ఆఖరునాటికి శతశాతం విస్తీర్ణంలో పంటలు సాగయినట్టు లెక్కలు చూపించారు. ఇందులో అత్యధికంగా వరి 2,34,112 ఎకరాలకు గాను 99శాతం నాట్లు పడినట్టు అధికారులు లెక్కలు చూపించారు. ఈఏడాది 2,35,000 ఎకరాల్లో నాట్లు వేసేందుకు అధికారులు అంచనాలు చూపిస్తున్నప్పటికీ, ఎక్కడెక్కడ ఏయే రకాలు విత్తనాలు ఎంతెంత అవసరమౌతాయనే లెక్కలు ఇప్పటికీ అధికారులు తేల్చలేదు. భూసారం, నీటి లభ్యతను బట్టి సోనామసూరి (బిపిటి 3291), సాంబమసూరి (బిపిటి 5204), అమర (ఎంటియు 1064), అత్యల్పంగా సూపర్ ఫ్రైమ్ కొత్తరకం వెరైటీ (ఎంటియు 1318), రాగోలు సన్నాలు (ఆర్‌జిఎల్ 2573) వంటి ఏడు రకాల వరి విత్తనాలను ప్రభుత్వం తరపున సబ్సిడీపై పంపిణీ చేశారు. మారుతున్న వాతావరణ పరిస్థితులు, వాటి ఆధారంగా వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనల మేరకు ఏటా విత్తన ప్రోత్సాహంలో తేడా ఉంటుంది. వీటి ఆధారంగా రైతులకు పెట్టుబడిలోనూ హెచ్చుతగ్గులు ఉంటాయి.

కానీ, సీజన్ ముంచుకొచ్చినప్పటికీ విత్తన ప్రాధాన్యతపై వ్యవసాయ శాఖ తరపున రైతులకు సూచనలు, సలహాలు ఇవ్వ లేదు. వరి తరువాత మొక్కజొన్న 35,055 ఎకరాలు, నువ్వులు 16,257 ఎకరాలు, చెరకు 15,040 ఎకరాలు, పత్తి 6,707 ఎకరాలు, వేరుశనగ 1487 ఎకరాలు, రాగులు 122 ఎకరాలు ఎకరాల్లో సాగవుతాయని అంచనాలు రూపొందించారు. మినుములు, పెసలు, కందులు తదితర అపరాలు కూడా 400 ఎకరాల్లో సాగయ్యే అవకాశం ఉంది. ఈ పంటల కోసం ప్రభుత్వం తరపున విక్రయించబోయే విత్తనాలు, ఎరువులు, వాటిపై ప్రభుత్వం ఇవ్వబోయే సబ్సిడీ తదితరాలపై ఇప్పటికీ అధికారులు క్లారిటీ ఇవ్వకపోవడం పట్ల రైతుల్లో ఆందోళన వ్యక్తమౌతోంది. ఇదే విషయమై జిల్లా స్థాయిలో కనీసం అధికారిక సమావేశాలు కూడా జరగకపోవడం గమనార్హం.

ఓట్ల లెక్కింపు అత్యంత కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి

- ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభం
- సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదు
- ఒకేసారి ఇవిఎంలు, పోస్టల్ బ్యాలెట్లు లెక్కింపు
- జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం

ఎన్నికల ప్రక్రియలో భాగంగా చేపట్టే ఓట్ల లెక్కింపు అత్యంత కీలకమని, ప్రతీఒక్కరూ అప్రమత్తంగా ఉండి ఈ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి ఆదేశించారు. ఆర్‌ఒలు, ఎఆర్‌ఒలు, డిటిలు, నోడల్ అధికారులకు ఓట్ల లెక్కింపు ప్రక్రియపై కలెక్టరేట్ ఆడిటోరియంలో తొలివిడత అవగాహన, శిక్షణా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియలో వివిధ దశలు, పాటించాల్సిన నిబంధనలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఓట్ల లెక్కింపు ప్రక్రియ మొత్తం ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా పూర్తి చేయాలని, సొంత నిర్ణయాలు తీసుకోకూడదని స్పష్టం చేశారు. చిన్న పొరపాటుకు కూడా తావివ్వద్దని, ప్రతీఒక్కరూ ఎంతో అప్రమత్తంగా ఉండి తమకు కేటాయించిన విధులను పూర్తి చేయాలని ఆదేశించారు. దీనికోసం ఈ ప్రక్రియపై అందరూ సమగ్ర అవగాహన కల్పించుకోవాలని సూచించారు. విజయనగరం, బొబ్బిలి నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు జెఎన్‌టియు గురజాడ విశ్వవిద్యాలయంలో, చీపురుపల్లి, రాజాం, ఎస్.కోట, నెల్లిమర్ల, గజపతినగరం నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు లెండి ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతాయని తెలిపారు. ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందని, అందువల్ల సిబ్బంది అంతా 6 గంటలకే తమకు కేటాయించిన లెక్కింపు కేంద్రాలకు చేరుకొని, అంతా సిద్దం చేసుకోవాలని సూచించారు. లెక్కింపు కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదని స్పష్టం చేశారు.

ఒకవైపు ఇవిఎంలలో ఓట్ల లెక్కింపు, మరోవైపు పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. పోస్టల్ బ్యాలెట్లు అధిక సంఖ్యలో పోలైనందున, లెక్కింపు పూర్తి కావడానికి ఎక్కువ సమయం పడుతుందని, అందుకు తగిన విధంగా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. విజయనగరం పార్లమెంటు స్థానం పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు మాత్రం లెండి కళాశాలలోనే నిర్వహిస్తామని తెలిపారు. దీనికోసం 20 టేబుళ్లతో పెద్ద హాలును సిద్దం చేస్తున్నామన్నారు. ఇవిఎంలలో ఓట్ల లెక్కింపు కోసం ఒక్కో హాలులో 14 టేబుళ్లను సిద్ధం చేస్తున్నామని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు కోసం మొత్తం 8 గదులను, ఇవిఎం ఓట్ల లెక్కింపు కోసం 14 హాళ్లను సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ప్రతీ గదిలో సిసి టివి ఉంటుందని, ఇవిఎంలు తీసుకువచ్చిన దగ్గరనుంచి ఓట్ల లెక్కింపు పూర్తి అయ్యేవరకు వీడియో రికార్డింగ్ కూడా నిర్వహిస్తామని తెలిపారు. ప్రతీ ఒక్కరూ తప్పనిసరిగా తమ గుర్తింపు కార్డును ధరించాలని, అవిలేకపోతే లోపలికి అనుమతించేది లేదని స్పష్టం చేశారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కించేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తొలివిడత లెక్కింపు, మలివిడత లెక్కింపు ప్రక్రియలను వివరించారు. కౌంటింగ్ హాలులో రిటర్నింగ్ అధికారులదే సర్వాధికారమని, వారే పూర్తిగా నిర్ణయాలు తీసుకుంటారని చెప్పారు. సిబ్బందిని ర్యాండమైజేషన్ ద్వారా కేటాయిస్తామన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, డిఆర్‌ఒ ఎస్‌డి అనిత, ట్రైనింగ్స్ నోడల్ ఆఫీసర్ సుధాకరరావు, ఆర్‌ఒలు పాల్గొన్నారు.

వృద్ధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శిక్షార్హులు

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి విజయ కళ్యాణి



సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి విజయ కల్యాణి

ప్రజాశక్తి-విజయనగరం లీగల్

వృద్ధులపట్ల నిర్లక్ష్యం, అలసత్వం వహిస్తే చట్ట రీత్యా నేరమని, శిక్షార్హులవుతారని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.విజయ కళ్యాణి అన్నారు. గురువారం స్థానిక జిల్లా న్యాయ సేవా సంస్థ భవనంలో వృద్ధుల సంరక్షణ, బాధ్యతలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జన్మనిచ్చిన వృద్ధాప్య తల్లిదండ్రుల పట్ల పిల్లలు నిర్లక్ష్యం, అలసత్వం వహిస్తే చట్ట రీత్యా నేరమని అన్నారు. తమ పిల్లలు ఉన్నత స్థాయిలో వుండాలని కోరుకొంటూ ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి ఒక స్థాయికి తెచ్చిన వారిని విస్మరించడం హేయమైన చర్యన్నారు. అటువంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలకు గురవుతారని అన్నారు. వృద్ధులు తమ సమస్యలు పరిష్కారం కోసం జిల్లా న్యాయ సేవా సంస్థను ఆశ్రయించి ఉచితంగా తగిన ఫలితాలను పొందవచ్చునని అన్నారు. వృద్ధాప్యంలో ఉన్నవారికి అవసరమైన ఆహారం ఆరోగ్యం, వైద్యం ఇతర వసతులను వారి పిల్లలే అందజేయాలని తెలిపారు. వికలాంగుల సంక్షేమశాఖ ఎడి జివిబి జగదీశ్ మాట్లాడుతూ జిల్లాకు ప్రభుత్వ సీనియర్ సిటిజన్‌ల వృద్ధాశ్రమం ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో వృద్ధులకు అవసరమైన ప్రత్యేక సదుపాయాల కోసం ప్రభుత్వానికి నివేదించామని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు సిహెచ్ త్రినాథ ప్రసాద్, సెట్విజ్ సిఇఒ బి.రామగోపాల్, చదలవాడ ప్రసాద్, జిల్లా ఎక్సటెన్షన్ మీడియా ఆఫీసర్ వి చిన్నతల్లి, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జోనల్ ప్రెసిడెంట్ కట్టమూరి చంద్ర శేఖర్, బి.రమేష్ పాల్గొన్నారు.

ఏడు ప్రభుత్వ హైస్కూళ్లు కళాశాలలుగా అప్ గ్రేడ్

- అడ్మిషన్లు కోసం విద్యాశాఖ కసరత్తు
- ఎంపిసి, సిఇసిలో అడ్మిషన్లు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం జిల్లాలో ఏడు ప్రభుత్వ జెడ్‌పి హైస్కూళ్లను జూనియర్ కళాశాలలుగా అప్ గ్రేడేషనన్ చేశారు. గత ఏడాది ధర్మవరం హై స్కూల్‌ను జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేయడంతో అక్కడ ఇంటర్ మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది జిల్లాలో మరో ఏడు ప్రభుత్వ జెడ్‌పి హైస్కూళ్లను జూనియర్ ఇంటర్‌లో ప్రవేశాలు కల్పిస్తూ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేశారు. జామి, బొండపల్లి, కోనూరు, రామభద్రపురం, ఎ.వెంకటాపురం, పిరిడి జెడ్‌పి ఉన్నత పాఠశాలల్లో ఈ ఏడాది నుంచి తరగతులు ప్రారంభించాలని విద్యాశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. మొదటి సంవత్సరం కేవలం ఎంపిసి, సిఇసి గ్రూపుల్లో మాత్రమే అడ్మిషన్లు ప్రారంభించారు. ఆయా పాఠశాలల పరిధిలో ఇటీవల పదో తరగతిలో ఉత్తీర్ణులైన వారిని జూనియర్ కళాశాలల్లో చేర్పించే బాధ్యతను మండల విద్యా శాఖ అధికారికి, జూనియర్ కళాశాలగా మారుతున్న హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు అప్పగించారు. జూన్ 12 నుంచి విద్యా సంవత్సరం ప్రారంభం కానుండంతో విద్యార్థులను జల్లెడ పట్టే పనిలో ఉపాధ్యాయులు ఉన్నారు. ప్రతి గ్రూపునకు 40 మంది విద్యార్థులు ఉండటంతో పూర్తి సంఖ్యలో ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యతను ఉపాధ్యాయులకు విద్యా శాఖ అధికారులు అప్పగించారు. దీంతో ఆ పాఠశాలలో చదివి ఉత్తీర్ణులైన వారిని, చుట్టుపక్కల పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసిన వారిని ఒప్పించే పనిలో ఉపాధ్యాయులు, మండల విద్యా శాఖ అధికారులు నిమగ్నమయ్యారు.



అడ్మిషన్లు జరుగుతున్నాయి



జూనియర్ కళాశాలలుగా ఏడు ప్రభుత్వ జెడ్‌పి హైస్కూళ్లను అప్‌గ్రేడ్ చేశారు. ఈఏడాది నుంచే తరగతులు ప్రారంభిస్తున్నాం. ఇప్పటికే మంజూరైన రెండు గ్రూపుల్లో విద్యార్థులను చేర్పించే ప్రక్రియను ప్రారంభించాం. సీనియర్ ఉపాధ్యాయులు, అనుభజ్ఞులు బోధించనున్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

ఎన్.ప్రేమ్ కుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి

అక్రమ సస్పెన్షన్ ఎత్తివేయాలి : ఎస్‌డబ్ల్యుఎఫ్

ప్రజాశక్తి- విజయనగరం కోట

ఆర్‌టిసి కార్మిక సంఘ నాయకులపై అక్రమ సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని ఎస్‌డబ్ల్యుఎఫ్ జిల్లా కన్వీనర్ వి.రాములు, కో-కన్వీనర్ ఎ.చంద్రయ్య కోరారు. ఈ మేరకు గురువారం ఆర్‌టిసి అధికారులకు వినతినిచ్చారు. ఈనెల 4న ఏలూరు లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్నారని ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర అధ్యక్షులను, మరో ఇద్దరు నాయకులను ఆర్‌టిసి యాజమాన్యం సస్పెండ్ చేసిందని పేర్కొన్నారు. వారిలో బహుజన వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తణుకు శ్యాంసన్, ఎన్‌ఎంయు తణుకు డిపో కార్యదర్శులను పత్రికలో ప్రకటన వచ్చిందనే పేరుతో సస్పెండ్ చేయడాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. వారిని వెంటనే ఉద్యోగాల్లో చేర్చుకోవాలని అధికారులను కోరారు.

రుతుక్రమం పరిశుభ్రతపై అవగాహన

ప్రజాశక్తి-విజయనగరం కోట



ర్యాలీ నిర్వహిస్తున్న ఐసిడిఎస్ సిబ్బంది

రుతుక్రమం సమయంలో పరిశుభ్రత పై యుక్త వయసు బాలికల్లో అవగాహన అవసరమని మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాంతీయ సంచాలకులు చిన్మయి దేవి అన్నారు. ప్రపంచ రుతుక్రమ పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా నగరంలోని మహిళా ప్రాంగణంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కిశోర బాలికలు, సూపర్ వైజర్ లు, సిడిపిఒలతో గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీని ఉద్దేశించి ఆర్ జె.డి. మాట్లాడారు. పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉంటామని తెలిపారు. ర్యాలీలో ఐసిడిఎస్ పీడీ బి. శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్ కేంద్రాల వద్ద విస్తృత భద్రత

ప్రజాశక్తి-విజయనగరం కోట



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి ఎం.దీపిక, పాల్గొన్న పోలీసు అధికారులు

ఎన్నికల కౌంటింగ్ కేంద్రాల వద్ద విస్తృత భద్రత ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్‌పి ఎం.దీపిక తెలిపారు. జూన్ 4న ఎన్నికల కౌంటింగు కేంద్రాల వద్ద చేపట్టాల్సి భద్రత, బందోబస్తు ఏర్పాట్లను సమీక్షించేందుకు పోలీసు అధికారులతో గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కౌంటింగు నిర్వహించే జెఎన్‌టియు, లెండీ ఇంజినీరింగ్ కళాశాలల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు అధికారులు, సిబ్బంది నిర్వహించాల్సిన విధులు, చేపట్టాల్సిన భద్రత చర్యలపై దిశా నిర్దేశం చేశారు. కౌటింగు కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన మూడంచెల భద్రత, రూఫ్‌టాప్ బందోబస్తు ఏర్పాటు చేయాలని, ట్రాఫిక్ రెగ్యులేషన్, వాహనాల పార్కింగుకు ప్రత్యేకంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కౌంటింగు కేంద్రాల వద్ద ప్రజలు గుమిగూడకుండా చూడాలన్నారు. కౌంటింగు కేంద్రాలకు విచ్చేసే వివిధ పార్టీలకు చెందిన కౌంటింగు ఏజంట్లు వాహనాలను కౌటింగు కేంద్రాల వద్ద ప్రత్యేకంగా నిర్ధేశించిన పార్కింగు ప్రాంతాలకు తరలించాలన్నారు. వాహనదారులు ఇబ్బందులు పడకుండా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకొని, కాషనరీ బోర్డులను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. కౌటింగు కేంద్రాల్లోకి వెళ్లే కౌటింగు ఏజంట్లును క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, రిటర్నింగు అధికారి జారీ చేసిన అనుమతి పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించిన తరువాత మాత్రమే కౌటింగు కేంద్రాల్లోకి అనుమతించాలని తెలిపారు. రిటర్నింగ్ అధికారులు, కౌటింగు సూపర్ వైజర్లు మినహా మిగిలిన వారి మొబైల్స్ ను కౌటింగు కేంద్రాల్లోకి అనుమతించ వద్దన్నారు. కౌటింగు కేంద్రాల పరిసరాలను బాంబ్ డిస్పోజల్స్ బృందాలతో తనిఖీలు చేయాలని, మహిళలను తనిఖీ చేసేందుకు ప్రత్యేకంగా మహిళా పోలీసు సిబ్బందిని నియమించాలని ఎస్‌పి ఆదేశించారు. ఫలితాలు వెల్లడైన తరువాత అల్లర్లు చెలరేగకుండా ముందస్తుచర్యలు చేపట్టాలని, పెట్రోలింగు నిర్వహించాలని, ముందుగా గుర్తించిన ప్రాంతాల్లో నిఘా పెట్టాలని అధికారులకు సూచించారు. సమావేశంలో అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్, ట్రైనీ ఐపిఎస్ మండ జావలి అల్ఫాన్స్, డిఎస్‌పిలు ఆర్.గోవిందరావు, పి.శ్రీనివాసరావు, విశ్వనాథ్, ఎఎస్ చక్రవర్తి, వీరకుమార్, విశ్వనాథ్, వీరకుమార్, యూనివర్స్, ఎస్.మహేంద్ర, పలువురు సిఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

జెవివి ఆధ్వర్యంలో వేసవి వినోదం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జనవిజ్ఞాన వేదిక విజయనగరం జిల్లా సమత విభాగం ఆధ్వర్యంలో గురువారం వేసవి వినోదం కార్యక్రమం స్థానిక రామకృష్ణానగర్‌లో ప్రారంభమైంది. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక సమత విభాగం రాష్ట్ర కన్వీనర్ జి.నిర్మల మట్లాడుతూ పిల్లలకి వేసవిలో వివిధ అంశాలపై అవగాహన కలిగించేందుకు, మెదడకు మేత, కేరంబోర్డు వంటి ఆటలతో పాటు దేశ భక్తిగీతాలు, అభినయ గీతాలు పాడిస్తూ పిల్లల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకు జెవివి ఆధ్వర్యాన ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పిల్లలు వివిధ అంశాలపై డ్రాయింగ్, సింగింగ్ తదితర వాటిల్లో పాల్గొన్నారు.



చిన్నారులతో పాటలు పాడిస్తున్న జెవివి సమతా విభాగం కన్వీనర్ నిర్మల

ఆస్తి ఘనం.. అంతా అన్యాక్రాంతం

- ఆలయ భూములు ఆక్రమణ
- పట్టించుకోని దేవాదాయ శాఖ
- ఈనెల 26,27,28 తేదీలలో ధారగంగమ్మ అమ్మవారి పండగ

ప్రజాశక్తి-శృంగవరపుకోట

శృంగవరపుకోట గ్రామ దేవత ధారగంగమ్మ ఆలయానికి శతాబ్దాల చరిత్ర ఉంది. దేవాదాయ ధర్మాదాయ శాఖకు చెందిన ఈ ఆలయం ఆధ్వర్యాన రెండేళ్లకు ఒకసారి గ్రామ దేవత అయిన ధార గంగమ్మ అమ్మవారి జాతరను అత్యంత వైభవంగా గ్రామ పెద్దలు నిర్వహిస్తూ ఉంటారు. పుణ్యగిరికి వెళ్లే రహదారిలో గల ఈ ఆలయానికి సర్వే నంబర్ 185/20 పట్టా నెంబర్ 855లో జగ్గ చెరువు నుండి దేవి కూడలి వరకు సుమారు రెండున్నర ఎకరాలు ఉన్న భూములను కొందరు ఆక్రమణదారులు వేరే సర్వే నెంబర్లతో రిజిస్ట్రేషన్ చేయించుకుని వాటిలో వ్యాపార సముదాయాలు నిర్మించి అక్రమార్జన చేస్తున్నారు. అయినా దీనిపై దేవాదాయ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం చూపడంతో ఆలయం ఏమాత్రం అభివృద్ధికి నోచుకోలేదు.

పట్టణంలోని ధారగంగమ్మ ఆలయానికి రెండున్నర ఎకరాల భూములు ఉన్నాయి. అవన్నీ అన్యాక్రాంతమయ్యాయి. దీంతో ఆలయానికి భక్తుల ద్వారా వచ్చే ఆదాయంతోనే ధూప దీప నైవేద్యాలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. దారగంగమ్మ ఆలయం, పుణ్యగిరి ఉమా కోటిలింగేశ్వర స్వామి దేవాలయాలకు టిక్కెట్ల విక్రయం, భక్తులు ఇచ్చే కానుకలు ద్వారా వచ్చే ఆదాయంతోనే ఆలయ అభివృద్ధికి, ధూప దీప నైవేద్యాలకు, పూజారి జీతభత్యాలకు వెచ్చించాల్సి ఉంది. ఈ ఆలయానికి నెలకు సుమారు 5 వేల వరకు ఖర్చు అవుతుంది. అయితే ఆలయానికి ఆదాయం లేక సిబ్బంది జీతాలు దేవాదాయ శాఖ సక్రమంగా చెల్లించటం లేదు. ఈ విషయమై ఆలయ కార్య నిర్వాహకులు నాగేంద్ర స్పందిస్తూ ఆక్రమణలపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.



ధార గంగమ్మ తల్లి ఆలయం

ఆక్రమణదారుల నిగ్గు తేల్చాలి

దేవాదాయ శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్లే ఆలయ భూములు అన్యాక్రాంతమయ్యాయి. ఆలయ భూములపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి ఆక్రమణదారుల నిగ్గు తేల్చాలి. గతంలో ఈ ఆలయ భూముల్లో 15 ఎరుకల కుటుంబాలు పాకలు వేసుకుని బుట్టలు, తట్టలు అల్లుకొని జీవనం సాగించాయి. వారిని బలవంతంగా ఖాళీ చేయించి ఆ ఇళ్లను జెసిబిలతో కూల్చారు. మిగతా వారికి పలుమార్లు నోటీసులు కూడా జారీ చేశారు. ఆలయ భూములు ఆక్రమించిన మిగతా వారిని కూడా కూడా ఖాళీ చేయించి ఆలయ భూములను స్వాధీనం చేసుకుంటామని అప్పటి దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ప్రసాద్ చెప్పారు. కానీ ఏళ్లు గడుస్తున్నా ఆలయ భూముల్లో పక్కా ఇళ్లు, హోటళు, వ్యాపార సముదాయాలు నిర్వహిస్తున్న వారిపై చర్యలు లేవు.

మద్దిల రమణ
సిపిఎం మండల కార్యదర్శి


ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ప్రకృతి క్షేత్రాల సందర్శన

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని వీలుపర్తి క్లస్టర్ చిన్న గుడిపాల గ్రామంలో ప్రకృతి వ్యవసాయ రీజనల్ అధికారులు ఆర్టివిల్ ప్రకాష్, ఆర్‌టిఒ హేమ సుందర్ ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను గురువారం సందర్శించారు. బోజంకివాని పాలెంలో రైతులతో సమావేశమై ఈ ఖరీఫ్ కాలంలో వరి విత్తనాలను షీడ్ బాల్స్ చేసి విత్తుకోవడం వల్ల వర్షాలు లేటుగా కురిసిన, వర్షం ఎప్పుడు పడితే అప్పుడు సీడ్ బాల్స్‌లో ఉన్న విత్తనం మొలక రావడానికి అనుకూలంగా ఉంటుందని వివరించారు. ఈ పద్ధతిని ప్రకృతి వ్యవసాయంలో పనిచేస్తున్న సిబ్బంది ప్రాక్టికల్‌గా చేసి రైతులకు చూపించాలన్నారు. నువ్వులలో నవధాన్యాలు వేసిన పొలాలను పరిశీలించి రైతుల అనుభవాలను తెలుసు కున్నారు. నువ్వులలో తెల్లజొన్న, బెండ, బీర, గోంగూర, చిక్కుడు, బొబ్బర పంటలను అంతర పంటలుగా వేయటం వల్ల అదనపు ఆదాయం పొందడంతో పాటుగా పంటలలో జీవన వైవిధ్యం జరుగుతుందన్నారు. దీని ద్వారా నేలకు పోషకాలు చేకూరుతాయని చెప్పారు. ప్రతి రైతు వరికి ముందు నవధాన్యాలను వేసుకోవడం వల్ల భూమిలో పోషకాలతో పాటుగా సూక్ష్మజీవులు పెరుగుతాయని ప్రధాన పంటకు మంచి పోషకాలు అందుతాయని కలుపు నివారణ అవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎఫ్ఏ వరప్రసాద్, ఎమ్.టి.ఎల్ వసంత, ఎమ్‌టి సన్యాసమ్మతో పాటుగా మండల ఇంఛార్జిలు, ఐసిఆర్‌పిలు రైతులు పాల్గొన్నారు.


ప్రత్యేకవసరాల పిల్లలను గుర్తిస్తున్న ఎంఇఒ దుర్గారావు

ప్రత్యేక అవసరాల పిల్లలు గుర్తింపు

ప్రజాశక్తి - వంగర

ప్రత్యేక అవసరాల గల పిల్లలను గుర్తించేందుకు గ్రామాలలో ఇంటింటా సర్వే చేపడుతున్నట్లు ఎంఇఒ వై.దుర్గారావు తెలిపారు. ఈ మేరకు మండలంలోని సంగాం, శివ్వాం, తలగాం గ్రామాలలో గురువారం సర్వే చేపట్టి పదిమందిని గుర్తించామని వెల్లడించారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలను పాఠశాలల్లో చేర్పించడం వల్ల ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ, విద్యా బోధన, ఉపకరణాలు, ప్రభుత్వం నుంచి వచ్చే స్కీములు అందుతాయని అన్నారు. మానసిక వైకల్యం గల పిల్లలను పాఠశాలల్లో చేర్పించే బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంగోజి, నాయుడు, పాల్గొన్నారు.


కూలీలతో మాట్లాడుతున్న ఎపిఒ హరినాద్

ఉపాధి పనుల వద్ద సౌకర్యాలు కల్పించాలి

ప్రజాశక్తి- రేగిడి

గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న పనులు వద్ద వేతనదారులకు సౌకర్యాలు కల్పించాలని ఎపిఒ సంకాబత్తుల హరినాథ్ తెలిపారు. గురువారం వన్నలి పంచాయతీలో యందు వాని చెరువు వద్ద జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. చెరువులో 230 మంది వేతనదారులు మస్టర్స్ తనిఖీ చేశారు. ముందుగా వేదనదారులతో ఉపాధి పనులపై అవగాహన కల్పించారు. వేతనదారులతో మాట్లాడుతూ రెండు పూటలా పనిచేయాలన్నారు. కొలతలు ప్రకారం పనిచేస్తే రూ.300 కూలీ వస్తుందన్నారు. మేట్లు ఎన్ఎంఎంఎస్ యాప్ ద్వారా హాజరు రెండు పూటలా పంపించాలని వెల్లడించారు. ప్రతీ వేతనదారులు నీళ్ళు తప్పనిసరిగా తీసుకు రావాలన్నారు. మెట్టు పొలం ఉన్న సన్న, చిన్నకారు రైతులకు పండ్లతోటలు వేసుకోవడానికి అవకాశం ఉందన్నారు. తోటలు ఉన్న రైతులకు కందకాలు, చెట్టు చుట్టూ ట్రెంచ్‌లు తవ్వుకోవడానికి అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ ఎర్రయ్య, మేట్లు, వేతనదారులు పాల్గొన్నారు.


బిసిజి టీకాను వేస్తున్న వైద్య సిబ్బంది

బిసిజి టీకా తప్పనిసరి

ప్రజాశక్తి - కొత్తవలస

బిసిజి టీకాను తప్పనిసరిగా వేసుకోవాలని వియ్యంపేట పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ బి. సింహాద్రినాయుడు అన్నారు. ఈ పిహెచ్‌సి పరిధిలో గల వియ్యంపేట, ముసిరామ్, దేవాడ, రామలింగాపురం, వీరభద్రపురం, తుమ్మికాపల్లి, నిమ్మళపాలెం, ఉత్తరాపల్లి సచివాలయాల్లో ప్రతీ గురువారం క్షయ వ్యాధి నివారణ కోసం వ్యాధి బారిన పడకుండా ఉండేందుకు 18 సంవత్సరాలు దాటినవారందరికి బి.సి.జి. టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. క్షయ రోగులు ఉన్న కుటుంబ సభ్యులకు, దూమపానం చేసిన వారికీ, మాధమేహం ఉన్నవారికి, రక్త పోటు ఉన్నవారికి ఈ వాక్సిన్ తప్పనిసరిగా వేయాలన్నారు. గర్భిణులకు, బాలింతలకు, హెచ్ఐవితో బాధపడిన వారికీ, తీవ్ర అనారోగ్యంతో మంచం పట్టిన వారికి, రక్తమార్పిడి చేయించుకున్న వారికీ ఈ వ్యాక్సిన్ వేయకూడదన్నారు. ఈ కార్యక్రమంలో పి.హెచ్.ఎన్. జగదాంబ, ఈఒ నరసింహారావు, హెచ్.వి. పద్మావతి, హెచ్.ఎస్.ఈశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్స్ సత్యారావు, ఈశ్వరరావు, ఏ.ఎన్.ఎమ్స్, ఆశ వర్కర్స్ పాల్గొన్నారు.

కెల్ల పండగకు తాగునీరు సరఫరా


గుర్ల: మండలంలోని కెల్ల గ్రామంలో ఈ నెల 20 నుంచి 22 వరకు జరిగిన పండగకు ధీరా ఫౌండేషన్ వ్యస్థాపకులు డాక్టర్ బొత్స సందీప్ తాగునీరు సరఫరా చేశారు. ఆ పండగ రెండు మూడు రోజులు ముందుగా కెల్ల గ్రామ పెద్దలు, నాయకులు బొత్స సందీప్‌ని కలిసి తమ గ్రామానికి పండగలో తాగునీరు కొరత లేకుండా అందించాలని కోరారు. దీంతో నీటి సరఫరాను ధీరా ఫౌండేషన్ తరుపున చేయడానికి డాక్టర్ సందీప్ సుముఖత వ్యక్తం చేసి గ్రామానికి వాటర్ ట్యాంక్‌లతో నిరంతరం తాగునీరు సరఫరా చేశారు. పండగ మూడు రోజులు తాగునీరు అందించిన ధీరా ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ బొత్స సందీప్‌కు గ్రామ యువత, పెద్దలు గురువారం కృతజ్ఞతలు తెలిపారు.

శిలాఫలకానికే పరిమితం

- ముందుకు కదలని ఇందిర జలప్రభ
- 100 ఎకరాలకు సాగునీరు ప్రశ్నార్థకమే
- 15 ఏళ్లుగా గిరిజనులకు తప్పని ఎదురుచూపులు

ప్రజాశక్తి - వేపాడ

మండలం కేజీపూడి రెవెన్యూ పరిధిలో ఇందిర జలప్రభ అభివృద్ధి పథకం ద్వారా నిధులు మంజూరు చేసి గిరిజన గ్రామాల్లో 100 ఎకరాలకు బోర్లు ద్వారా సాగునీటిని అందించాలని 2011లో కాంగ్రెస్ ప్రభుత్వం శిలాఫలకం ఏర్పాటు చేసింది. అప్పటి ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి శిలాఫలకాన్ని ఆవిష్కరించి రూ.కోటితో సాగునీటి బోర్లు ఏర్పాటు చేసి గిరిజన రైతులకు అందిస్తామని చెప్పారు. అప్పటి నుంచి నేటి వరకూ శిలాఫలకం తప్ప బోర్లు ఎక్కడా వేయలేదు. దీంతో గత 15 సంవత్సరాలుగా గిరిజనులు సాగునీటి కోసం ఎదురు చూస్తున్నారు.


ఇదే ఇందిర జలప్రభ శిలాఫలకం

2011 తరువాత మరోసారి జరిగిన ఎన్నికల్లో 2014లో కూడా కోళ్లలలితకుమారి ఎమ్మెల్యేగా విజయం సాధించినా ఈ ప్రాజెక్టును పట్టించుకోలేదు. 2019లో వైసిపి నుంచి కడుబండి శ్రీనివాసరావు గెలిచినా ఆయన కూడా దీనిపై దృష్టి పెట్టలేదు. పదవులు పొందడమే తప్ప ఈ పథకం ద్వారా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడానికి ఎవరూ సాహసించలేదు. మంత్రి బొత్స సత్యనారాయణ కూడా ఇటువైపు కన్నెత్తి చూడలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఎన్నికల సమయంలో గిరిజనులు మా ఆడపడుచులు, అన్నదమ్ములని చెప్పే నాయకులు వారి అభివృద్ధికి మాత్రం కృషి చేయడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఇందిర జలప్రభ పథకం ద్వారా బోర్లు తవ్వించి సాగునీటిని రైతులకు అందించాలని గిరిజనులు కోరుతున్నారు.

అభివృద్ధికి నోచుకోని దబ్బిరాజుపేట చెరువు

మండలంలో దబ్బిరాజుపేట గ్రామానికి వెళ్లే రోడ్డు మార్గంలో దబ్బిరాజుపేట చెరువు అభివృద్ధికి నోచుకోలేదు. గతంలో టిడిపి ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి రూ.97.40 లక్షలు జిల్లా జల వనరుల శాఖ నుంచి చెరువు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయించారు. 2019 జనవరిలో అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని కూడా ఏర్పాటు చేశారు. కానీ పనులు ముందుకు కల్లేదు. ఈ లోగా ఎన్నికలు రావడంతో ఆమె ఓటమి చెంది వైసిపి ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అధికారంలోకి వచ్చారు. ఈయన ఈ చెరువు ఊసే ఎత్తలేదు. ఈ చెరువు అభివృద్ధి చేస్తే దబ్బిరాజుపేట, వల్లంపూడి, ఆతవ, ఎఎస్ పేట గ్రామాల ఆయకట్టు రైతులకు పుష్కలంగా పంటలు పండించుకునే అవకాశం కలిగేది. ఖరీఫ్ సీజన్ ముంచుకొస్తున్న తరుణంలో ప్రభుత్వం దృష్టి సారించి చెరువును అభివృద్ధి చేసి తద్వారా రైతులకు సాగునీటిని అందించాలని రైతులు కోరుతున్నారు.


అభివృద్ధికి నోచుకోని దబ్బిరాజుపేట చెరువు

గంజాయికి కేరాఫ్‌గా బొబ్బిలి

ప్రజాశక్తి- బొబ్బిలి

గంజాయికు బొబ్బిలి కేరాఫ్‌గా మారుతుంది. గంజాయి మత్తుకు యువత బానిసవుతున్నారు. విచ్చలవిడిగా గంజాయి అమ్మకాలు జరగడంతో యువత బానిసై దాడులకు తెగబడుతున్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో గంజాయి విచ్చలవిడిగా అందుబాటులోకి వస్తున్నా నివారణకు ఎస్ఇబి, పోలీసులు ఎటువంటి చర్యలూ తీసుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. గంజాయి మత్తులో యువత జీవితాలు నాశనం అవుతున్నాయని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బానిసవుతున్న యువత

యువత గంజాయికు బానిసవుతున్నారు. గంజాయి మాఫియా ఒడిషా నుంచి గంజాయి తీసుకువచ్చి చిన్నచిన్న పొట్లాలు కట్టి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో అమ్మకాలు జరుపుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. పట్టణ, గ్రామాల్లో గంజాయి విచ్చలవిడిగా దొరకడంతో చిన్నపిల్లలు సైతం గంజాయికు అలవాటు పడుతున్నారు.

బానిసవుతున్న యువత

గంజాయి మత్తులో కుటుంబంపై దాడి


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధిత కుటుంబ సభ్యులు

గంజాయి మత్తులో కుటుంబంపై దాడి

రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి డౌన్‌లో శ్రీఅంజనేయ స్వామి ఆలయం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ వద్ద బుధవారం రాత్రి గంజాయి మత్తులో యువకులు హల్ చల్ చేశారు. ఎగ్జిబిషన్‌కు వచ్చిన మహిళలు పట్ల గంజాయి మత్తులో యువకులు అసభ్యకరంగా ప్రవర్తించడంతో అక్కడే ఉన్న ఒక కుటుంబం యువతను మందలించింది. దీంతో కక్ష పెట్టుకున్న యువకులు గంజాయి మత్తులో కుటుంబ సభ్యులపై దాడి చేశారు. ఇద్దరు చిన్నపిల్లలు ఉన్నప్పటికీ ఇద్దరు చిన్నారులు, భార్యాభర్తలపై దాడి చేసి గాయపరిచారు. గాయపడిన నలుగురు ప్రభుత్వ ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. దాడిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. గంజాయి మత్తులో ఉన్న యువకులు 18 ఏళ్ల లోపు వారే కావడం గమనార్హం.

గంజాయి నివారణపై ఉదాసీనత

గంజాయి నివారణపై పోలీసులు, ఎస్ఇబి అధికారులు ఉదాసీనత ప్రదర్శిస్తున్నారు. వీరి ఉదాసీనత వల్ల పట్టణ, గ్రామాల్లో గంజాయి విచ్చలవిడిగా దొరుకుతుంది. గంజాయి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


కేరమ్ ఆడుతున్న విద్యార్థులు

కథల పుస్తకాలు చదివిన విద్యార్థులు

ప్రజాశక్తి- డెంకాడ

స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిబిరంలో భాగంగా విద్యార్థులు గురువారం కథలు పుస్తకాలు చదివారు. అనంతరం విద్యార్థులందరూ కేరమ్స్, లూడో, చెస్, స్నేక్ అండ్ లేడర్ వంటి ఇండోర్ గేమ్స్ ఆడారు. విద్యార్థులకు చాక్లెట్స్ పంచిపెట్టారు.


మాట్లాడుతున్న భాషా

చదరంగంతో మెదడుకు మేత

విజయనగరం కోట: చదరంగం మెదడకు మేత అని విశ్రాంత ఉపాధ్యాయులు ఎస్‌కె భాషా అన్నారు. గురువారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థులచే నీతి కథలు చదివించారు. అనంతరం కుమారి షణ్ముఖ ప్రియా విద్యార్థులకు సంగీతం నేర్పించారు. లక్ష్మణ్ చదరంగం బేసిక్స్‌ను విద్యార్థులకు తెలియజశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ కార్యదర్శి బి లక్ష్మి, సహాయ గ్రందాలయ అధికారి కే శ్రీనివాసరావు ఇతర గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ రవాణాపై చర్యలు

ప్రజాశక్తి- బొబ్బిలి

ఇసుక అక్రమ రవాణాపై చర్యలు తీసుకుంటామని ఎస్ఇబి ఎస్ఐ తిరుమలరావు, ఆర్ఐ చక్రవర్తి అన్నారు. మండలంలోని అలజంగి సచివాలయంలో గురువారం ట్రాక్టర్ ఓనర్స్, డ్రైవర్లతో ఇసుక అక్రమ రవాణాపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఇసుక రవాణాకు ఎటువంటి అనుమతులూ లేవని, అక్రమరవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఒకే సిలబస్‌ను అమలు చేయాలి

ఎపిటిఎఫ్ రాష్ట్ర అకడమిక్ కన్వీనర్ జె సి రాజు

ప్రజాశక్తి- బొబ్బిలి

రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో వచ్చే విద్యాసంవత్సరం నుంచి విద్యార్థులకు ఒకే విధమైన సిలబస్‌ను ప్రవేశ పెట్టాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర అకడమిక్ కన్వీనర్ జెసి రాజు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఎన్‌జిఒ హోమ్‌లో ఫెడరేషన్ డివిజన్ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని బొబ్బిలి మండల శాఖ అధ్యక్షులు సిహెచ్‌జె ప్రవీణ్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఎపిటిఎఫ్ రాష్ట్ర నాయకులు జెసి రాజు మాట్లాడుతూ 6,7 తరగతులకు గణితం, సామాన్య శాస్త్రం, ఇంగ్లీష్ సిబిఎస్ఇ సిలబస్ కాగా మిగతావి రాష్ట్ర సిలబస్ అని అలాగే 8,9,10 తరగతుల విద్యార్థులు అన్ని సబ్జెక్ట్స్‌ను ఒకే సిబిఎస్ఇ సిలబస్‌లోనే చదువుతారని కానీ పరీక్షలు వేరువేరుగా రాయాల్సి రావటంతో విద్యార్థులు, తల్లితండ్రులు తీవ్ర గందరగోళానికి గురవుతున్నారని అన్నారు. ఒకే సిలబస్ చదివిన విద్యార్థులు కొందరు సిబిఎస్ఇ పరీక్షలు రాస్తే మరికొందరు రాష్ట్ర పరీక్షల నిర్వహణ విభాగం నిర్వహించే పరీక్షలు రాస్తారని, ప్రశ్న పత్రాల స్థాయి, విద్యార్థుల సామర్థ్యాల పరిశీలనలో వ్యత్యాసం వుంటుందని ఇది సరైన పద్ధతి కాదని అన్నారు. ఒకే సిలబస్, ఒకే పరీక్షల విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని, విద్యార్థులందరికీ సమన్యాయం, సమాన అవకాశం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. 117వ జిఒను రద్దు చేసి ప్రాథమిక విద్య బలోపేతం అయ్యేలా ఒకటి నుండి ఐదో తరగతి వరకు


మాట్లాడుతున్న జెసి రాజు

ప్రాథమిక పాఠశాలలను ఒకేచోట పెట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి పద్మ మాట్లాడుతూ ప్రాథమిక విద్య, విద్యార్థి ఇష్టాన్ని బట్టి మాధ్యమాన్ని ఎంచుకొనేలా తెలుగు, ఆంగ్ల మాధ్యమాలు విద్యార్థికి అందుబాటులో ఉంచి వాటిని కొనసాగించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని ఆమె డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా గౌరవాధ్యక్షులు బంకురు జోగినాయుడు, సిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్లయ్య, లక్ష్మణరావు, రామకృష్ణ, పరిసినాయుడు కార్యకర్తలు పాల్గొన్నారు.

రూ.లక్షకు ..70 వేలు

ఊపందుకున్న పందేలు

ప్రజాశక్తి - నెల్లిమర్ల



ఎన్నికల ఫలితాలు దగ్గర కొస్తున్న నేపథ్యంలో మండలంలో పందేలు ఊపందుకున్నాయి. మండల కేంద్రంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఈ పందేలు జోరుగా సాగుతున్నాయి. ముఖ్యంగా ఎన్‌డిఎ కూటమి అభ్యర్థి జనసేన గెలుస్తుందని రూ.లక్షకు, వైసిపి నుంచి రూ.70వేలు పందెం కాస్తారా అంటూ కూటమి నాయకులు, అభిమానులు తిరుగుతున్నారు. ప్రజా సంక్షేమ పథకాలు తమని గెలిపిస్తాయని వైసిపి వారు చెబుతుంటే ప్రభుత్వ వ్యతిరేక ఓటు, కూటమి మ్యానిఫెస్టో టిడిపి, జన సేన ఉమ్మడి అభ్యర్థిని గెలిపిస్తుందని కూటమి నాయకులు ఢంకా బజాయించి చెబుతున్నారు. గెలుపు పై ఇరు వర్గాలు ధీమా వ్యక్తం చేస్తుంటే పందెం రాయుళ్లు ఇదే అదునుగా రూ.1లక్షకు రూ.70వేలు పందెం కాయండని వైసిపి వాళ్లకు సవాల్ విసురుతున్నారు. కానీ పందెం కోసం వైసిపి వారు ముందుకు రావడం లేదని చర్చ జరుగుతుంది. ఏదేమైనా జూన్ 4న వెలువడే ఎన్నికల ఫలితాల్లో ఓటరు ఎవరికి పట్టం కడతారో వేచి చూడాల్సిందే.

ఆరోగ్యశ్రీ సేవలు కట్

ప్రజాశక్తి- రేగిడి

రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్ ఆసుపత్రిలో రూ.25 లక్షలతో ఆరోగ్యశ్రీ సేవలు ప్రజలకు అందిస్తామని భరోసా ఇచ్చింది. అయితే కార్పొరేట్ హాస్పిటల్‌కు బకాయిలను ప్రభుత్వం చెల్లించకపోవడంతో శుక్రవారం నుంచి కార్పొరేట్ హాస్పిటల్‌లో ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేస్తామని ఖరాకండిగా ప్రభుత్వానికి చెప్పేశారు. రెండు రోజులుగా ప్రభుత్వం కార్పొరేట్ ఆసుపత్రి యాజమాన్యులతో చర్చలు జరిగినప్పటికీ ఆ చర్చలు విఫలం కావడంతో శుక్రవారం నుంచి ఆరోగ్యశ్రీ సేవలు పూర్తిగా నిలిచిపోనున్నాయి. దీంతో రోగులకు ఇబ్బందులు తప్పవని ఆవేదన వ్యక్తమవుతోంది. రూ.230 కోట్లు విడుదల చేస్తామని ప్రభుత్వం చెబితే దానికి కార్పొరేట్ ఆసుపత్రుల యాజమాన్యం నిరాకరించింది. వేల కోట్ల రూపాయలు కార్పొరేట్ ఆసుపత్రుల యాజమాన్యానికి బకాయిలు ఉన్నప్పటికీ ఈ రూ.230 కోట్లు ఎలా సరిపోతాయని నిరాకరించారు. పూర్తి బకాయిలు చెల్లిస్తే తప్ప సేవలు అందించమని తేల్చేశారు. రాజాం పట్టణంలో అమృత ఆసుపత్రి, జిఎంఆర్ కేర్ మరికొన్ని కార్పొరేట్ ఆసుపత్రిలో ఈ సేవలు నిలిచిపోనున్నాయి. విజయనగరం జిల్లాలో సుమారు 23 కార్పొరేట్ ఆసుపత్రుల్లో కూడా సేవలు నిలిచిపోతాయని ఆస్పత్రుల యాజమాన్యాలు చెబుతున్నాయి. ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోనుండటంతో రోగులు ఉసూరుమంటున్నారు.

27న రాష్ట్ర స్థాయి విద్యా సదస్సు : యుటిఎఫ్

ప్రజాశక్తి- గజపతినగరం

ఈ నెల 27న సోమవారం ఉదయం 9.30గంటలకు శేషగిరి తృతీయ వర్ధంతి సందర్భంగా కెఎల్‌పురంలో నిర్మిస్తున్న శేషగిరి విజ్ఞాన కేంద్రంలో 'విద్యారంగంలో పరిణామాలు - సవాళ్లు' అనే అంశంపై జరగనున్న రాష్ట్ర స్థాయి విద్యా సదస్సును జయప్రదం చేయాలని యుటిఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం స్థానిక ప్రాంతీయ కార్యాలయంలో ఈ సదస్సుకు సంబంధించిన ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా కోశాధికారి చింత భాస్కరరావు, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ అల్లు శంకరరావు, రాష్ట్ర కౌన్సిలర్ కిల్లాడ అప్పారావు మాట్లాడుతూ ఆ రోజు సదస్సుకు ప్రధానవక్తగా ప్రముఖ మేధావి, విద్యారంగంలో దేశ, విదేశాల్లో పరిశోధన చేసి ఎన్నో పుస్తకాలు రచించి శాసనమండలి ప్రొటెమ్ స్పీకర్‌గా పనిచేసిన విఠపు బాలసుబ్రమణ్యము, యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్ ప్రసాద్, ఉత్తరాంధ్ర యుటిఎఫ్ నాయకత్వం హాజరవుతారని ఉపాధ్యాయులు అందరూ హాజరయ్యి సదస్సు జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు జివి నారాయణ, జిల్లా సిపిఎస్ సబ్ కమిటీ కన్వీనర్ పి రాంప్రసాద్, బొండపల్లి మండల అధ్యక్షులు పి శ్రీనివాసరావు, దత్తి రాజేరు మండల బాధ్యులు వి శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.



ఆహ్వాన పత్రికలను విడుదల చేస్తున్న యుటిఎఫ్ నాయకులు


కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె. సురేష్

కొనసాగుతున్న నిరసన

ప్రజాశక్తి - కొత్తవలస

జిందాల్ కర్మాగారం వద్ద కార్మికులు చేస్తున్న నిరసన ఆరో రోజుకు చేరింది. ఈ సందర్భంగా గురువారం సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె. సురేష్ మాట్లాడుతూ జిందాల్ కర్మగారాన్ని యాజమాన్యం బెషరతుగా తెరిపించి కార్మికులందరికీ పని కల్పించాలని, లేని పక్షంలో ఆందోళన తీవ్రతను చేస్తామని అన్నారు. జిందాల్ యాజమాన్యం కార్మికులను రోడ్డుపై నెట్టిందని, ముందస్తు సమాచారం లేకుండా కంపెనీకి లేఆఫ్ ప్రకటించడాన్ని తప్పు పట్టారు. కంపెనీ మూసివేసి వారం రోజులు గడుస్తున్నా యాజమాన్యం తీరులో మార్పు లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కుటుంబాలతోనున్న కార్మికులు ఏమి చేయాలో తోచని పరిస్థితిని, దుస్థితినియాజమాన్యం తీసుకువచ్చిందన్నారు. యాజమాన్యం బేషరతుగా కంపెనీ తెరిచి, కార్మికులందరికీ పని కల్పించాలని డిమాండ్ చేశారు. గురువారం కొత్తవలస మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి వంట వార్పుకు సహకరించారు. ఈ కార్యక్రమంలో జిందాల్ టిఎన్‌టియుసి నాయకులు పిల్ల అప్పలరాజు, సలాది భీమయ్య, సిఐటియు నాయకులు గాడి అప్పారావు, మద్దిల రమణ, వైయస్‌ఆర్‌టియుసి నాయకులు లగుడు వామాలు, పెదిరెడ్ల ప్రసాద్, నమ్మి చినబాబు, బొట్ట రాము, బాలిబోయిన ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గౌతమ బుద్ధుడి జయంతి

ప్రజాశక్తి- బొబ్బిలి రూరల్

గ్రీన్ బెల్ట్ సొసైటీ ఆధ్వర్యంలో గౌతమ బుద్ధిని జయంతి సందర్భంగా మండలంలోని కునుకువానివలస వద్ద రిటైర్డ్ టీచర్ చప్ప అప్పలనాయుడు నిర్మించిన బుద్ధుని విగ్రహం వద్ద గ్రీన్ బెల్ట్ సొసైటీ సభ్యులు శర్మ, గౌరీ, మల్లేశ్వరావు, శ్రీనివాస్, రామకృష్ణ, గంగాధర్, రామారావులు గురువారం పూలమాలలు వేసి ఆయన బోధనలు సారాంశంను గుర్తు చేశారు. సమాజంలో శాంతి నెలకొల్పడమే లక్ష్యంగా గౌతమ బుద్ధుని ప్రబోధనలు ఉన్నాయని వారు తెలిపారు. అనంతరం విగ్రహం వద్ద మొక్కలు నాటారు. విశ్రాంత ఉపాధ్యాయులుగా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న అప్పలనాయుడుని శాలువాతో సత్కరించారు.

వేపాడ: మండలంలోని సింగరాయి ఎస్‌సి కాలనీలో గౌతమ బుద్ధుని జయంతి ఘనంగా నిర్వహించారు. ముందుగా బుద్ధుని విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త అప్పారావు మాట్లాడుతూ సర్ధర్మ బోధ ద్వారా అజ్ఞానం తొలగించి, జ్ఞానాన్ని ప్రసాదించి, దుఃఖం దూరమై పరమ శాంతి పొందే మార్గాన్ని బోధించిన గురువుల పట్ల విశ్వాసం, గౌరవం, కృతజ్ఞతలు కలిగి ఉండాలన్నదే గౌతమ బుద్ధుని సందేశమన్నారు. అనంతరం పిల్లలకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశవర్కర్ జుంజారు రామలక్ష్మి, గొల్ల మహేష్, విద్యార్థులు పాల్గొన్నారు.


వేపాడ: గౌతమ బుదిని విగ్రహం వద నివాళులర్పిసున్న గ్రామసులు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సింహాచలం

ప్రాణాపాయ స్థితిలో యువకుడు

రక్తదాతల కోసం ఎదురుచూపు

ప్రజాశక్తి-బలిజిపేట

మండలంలోని అరసాడ గ్రామానికి చెందిన శివ్వాపు సింహాచలం అనే యువకుడు ఎనీమియాతో బాధపడుతున్నాడు. రక్తం చాలక ప్రస్తుతం ప్రాణాపాయ స్థితిలో విజయనగరం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆ యువకుడి శరీరంలో 1.4 పాయింట్ల రక్తం మాత్రమే ఉందని వైద్యులు చెబుతున్నారు. రక్తం అత్యవసరం కావడంతో అరసాడకు చెందిన ఆర్ఎంపి చొల్లంగి నీలకంఠం గురువారం ఆస్పత్రికి వెళ్లి యూనిట్ రక్తాన్ని దానం చేశాడు. ఆ యువకుడికి ఆరు యూనిట్ల రక్తం అవసరం కాగా, రెండు యూనిట్ల బ్లడ్‌ను దాతలిచ్చారు. మరో నాలుగు యూనిట్ల రక్తం అవసరం కావడంతో కుటుంబ సభ్యులు దాతల కోసం ఎదురు చూస్తున్నారు. రక్తదాతలు స్పందించి 89854 94653 నంబర్‌ను సంప్రదించాలని వేడు కొంటున్నారు.